క్లుప్తంగా

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

చొప్పదండి: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల్లో ఎండగడుతామని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, మినుపాల తిరుపతిరావు, వెల్మ శ్రీనివాస్ రెడ్డి, ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, గడ్డం చుక్కారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతికతపై ఆసక్తి పెంచుకోవాలి



విద్యార్థులకు సాంకేతికతను వివరిస్తున్న కోచ్

చొప్పదండి: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంచుకోవాలని జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి కోరారు. మండలంలోని రుక్మాపూర్ శివారులోని మోడల్ స్కూల్‌లో అబ్దుల్ కలాం స్ఫూర్తితో చేపట్టిన ప్రయోగశాల బస్సును విద్యార్థులు మంగళవారం సందర్శించారు. రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, ఏఐ లాంటి నమూనాలను ప్రదర్శించారు. సుమారు 600 మంది విద్యార్థులు నమూనాలను ఆసక్తిగా పరిశీలించారు. కార్యక్రమ నిర్వాహకుడు మధులాష్ మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం స్ఫూర్తితో ఫ్యూచర్ ల్యాబ్ ఆన్ వీల్స్ అనే బస్సును ఇప్పటివరకు 22 జిల్లాల్లో తిప్పామని, విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంచడమే తమ ఉద్దేశమన్నారు. యువతలోని ప్రతిభను వెలికితీయడానికి కార్యక్రమం ఉపయోగపడుతుందని, క్రిటికల్ థింకింగ్, సమస్యల పరిష్కారం వంటి నైపుణ్యాల అభివృద్ధికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంవో అశోక్ రెడ్డి, జీసీడీవో కృపారాణి, ప్రిన్సిపాల్ సుధాకర్, నిర్వాహకులు చంద్రకిరణ్, అజయ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, దిలీప్‌కుమార్, నీరజ్ కుమార్, సిద్ధార్థ, ధనుష్, జగదీశ్, రోహిత, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



ఫిర్యాదు అందిస్తున్న రెడ్డి జేఏసీ సభ్యులు

చొప్పదండి: రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం చొప్పదండి మండల రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 2న వరంగల్ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన బీసీ బహిరంగ సభతో పాటు పలు టీవీ చానళ్లలో రెడ్డి సామాజిక వర్గంపై అసభ్యకరంగా మాట్లాడారని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు అందించిన వారిలో అధ్యక్షుడు సైకిలాబ్ సత్యనారాయణ రెడ్డి, రాజిరెడ్డి, నర్సింహరెడ్డి, రవీందర్‌రెడ్డి, మణిశంకర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రాజిరెడ్డి, అంజిరెడ్డి, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు రాక ఇబ్బందులు

రామడుగు: విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులలు రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నాయకుడు రాకం ప్రభాకర్ మంగళవారం ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల 27 రోజుల పాటు సమ్మె చేయగా ప్రభుత్వం సమ్మెను విరమింపజేయించిందని, సమ్మె చేసిన రోజులకు కూడా వేతనం అందిస్తామని చెప్పిన ప్రభుత్వం మాటను మరిచిపోయిందన్నారు. ఇప్పటికైన జీతాలు అందజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సన్మానం

తిమ్మాపూర్: మండలంలోని పొరండ్ల సహకార పరపతి సంఘం వార్షిక మహాసభ మంగళవారం నిర్వహించారు. మన్నెంపల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి స్వామిరెడ్డి, డైరెక్టర్లను సత్కరించారు. 14వ తేదీతో పాలకవర్గ పదవీకాలం ముగియనుంది ఈ నేపథ్యంలో చివరి సమావేశంలో సన్మానం చేశారు. మాజీ సర్పంచ్ మేడి అంజయ్య, సుదగోని శ్రీనివాస్‌గౌడ్, కొయ్యడ తిరుపతిగౌడ్, జాప రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అరకొర వసతులు

అందని బకాయిలు

- సంక్షేమ వసతిగృహ విద్యార్థుల అవస్థలు
- వర్షాకాలంలో హాస్టల్ పరిసరాలు దుర్గంధం
- మూడేళ్లుగా అందని ప్రభుత్వసాయం
- పట్టించుకోని అధికారులు, నాయకులు



ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహ సముదాయం ఎదుట చెత్తాచెదారం

హుజూరాబాద్: ఉచిత నిర్బంధ విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని రాజ్యాంగంలో పొందిపరిచిన విషయాన్ని పలు సందర్భాల్లో పాలకులు, అధికారులు మార్చిపోతున్న సంఘటనలు సమాజంలో నెలకొన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పేదరికాన్ని జయించేందుకు చదువుల తల్లిని నమ్ముకొని పట్టణంతోపాటు నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ప్రభుత్వ బాలుర వసతి గృహాల్లో ఉంటున్నారు. వీరికి ప్రతినెలా 22 నుంచి 24 తేదీల్లో పాకెట్ మనీ కింద రూ.500 ప్రభుత్వం అందించాల్సి ఉండగా మూడేళ్లుగా నగదు అందడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు విద్యార్థులు రాసుకునేందుకు ఏటా ఇవ్వాల్సిన నోట్‌బుక్స్ కూడా పంపిణీ చేయడం లేదు. అలాగే స్పోర్ట్స్ మెటీరియల్ మూడేళ్లుగా రావడం లేదు. విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా స్టడీ చైర్స్ గతంలో ఇచ్చేవారని ప్రస్తుతం ఇవ్వకపోవడంతో నేలపైనే కూర్చొని చదువుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. సమస్యలను వింటూ వెళ్లిపోయే నాయకులు, అధికారులు ఉన్నారే కానీ పరిష్కరించే వారు కరువయ్యారని,. ప్రభుత్వాలు మారినా పేద విద్యార్థులకు ప్రయోజనం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు విద్యకు ప్రాధాన్యం కల్పిస్తామంటున్నాయని కానీ ఆచరణలో సాధ్యం కావడంలేదు. మూడేళ్లుగా విద్యార్థులకు అందించాల్సిన బకాయిలు విడుదల కాక నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. హుజూరాబాద్ పట్టణాన్ని ఆనుకొని ఉన్న బుడగజంగాలకాలనీలోని వసతిగృహం చుట్టూ వర్షాకాలంలో నీరు నిలుస్తోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దుర్గంధం వెలువడుతోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, నాయకులు వసతి గృహాన్ని, కాలనీని సందర్శించి తాత్కాలిక చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని, శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమౌతున్నారని, అన్ని వసతిగృహాల్లో అరకొర వసతులు ఉన్నాయని, ప్రభుత్వం ఇకనైనా స్పందించాలని కోరుతున్నారు.

> హుజూరాబాద్ డివిజన్ వ్యాప్తంగా 13 ఎస్సీ, 4 బీసీ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి.
>
> వీటిల్లో 410 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

నిధులు విడుదల చేయాలి



ప్రతినెల 22 నుంచి 24 తేదీల్లో పాకెట్ మనీ కింద రూ.ఐదు వందలు ప్రభుత్వ నుంచి రావాల్సి ఉండగా మూడేళ్లుగా అందించడం లేదు. దీనికి తోడు విద్యార్థులు రాసుకునేందుకు ఏటా ఇవ్వాల్సిన నోట్‌బుక్స్ చాలా రోజులుగా ఇవ్వడం లేదు. పెండింగ్ నిధులు విడుదల చేయాలి.

– లకవత్ శేఖర్, డిగ్రీ విద్యార్థి

ఇబ్బందులు పడుతున్నారు



ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేసి విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలి. వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వసతిగృహాల సంక్షేమానికి పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి.

– ఆర్. వెంకటేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



వర్షాకాలంలో వరదనీరు వసతిగృహం చుట్టూ చేరుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేశాం. పెండింగ్ బిల్లులు విడుదల చేయడంతోపాటు విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి.

– సుమన్, హాస్టల్‌వార్డెన్, హుజూరాబాద్

యూరియా నిల్వలపై తనిఖీ

జమ్మికుంట: పట్టణంలోని ఫర్టిలైజర్స్ షాపుల్లో ఏవో ఖాదర్ హుస్సేన్ యూరియా నిల్వలపై మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్‌ల్లో 60 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు షాపుల్లో 180 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, వదంతులు నమ్మొద్దని, రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.



తనిఖీ చేస్తున్న ఏవో ఖాదర్ హుస్సేన్

హుజూరాబాద్‌లో బీజేపీ వర్క్‌షాప్



హుజూరాబాద్: మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



శంకరపట్నం: ఓట్లు అభ్యర్థిస్తున్న గోదావరి

హుజూరాబాద్: బీజేపీ హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల వర్క్‌షాప్ నిర్వహించారు. దేశం బీజేపీ వైపు చూస్తోందని, ప్రజలు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలు, నాయకులు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల కో–ఆర్డినేటర్ వేణు, అంకతి వాసు, నల్ల సుమన్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ వెంకట్‌రెడ్డి, మాసాడి ముత్యంరావు, సీనియర్ నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, శశిధర్, రమేశ్, రాజశేఖర్, సంజీవ్, సుమన్, సారయ్య, శ్రీకాంత్, సంతోష్, వెంకటేష్, భాస్కర్ యాదవ్, నగేష్, సమ్మయ్య, సంపత్, సంతోష్ కుమార్, హరీష్, చతర్‌సింగ్, కార్తీక్, శివకృష్ణ, సదయ్య, కొండల్‌రెడ్డి, దేవేంద్ర, మాధవి,అపర్ణ, రాజు, స్వర్ణలత, మహేష్, వెంకటేశ్వర్లు, హృతిక్, కొండల్‌రెడ్డి, రేణుక, బాబర్, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి తరుపున ఆయన సతీమణి గోదావరి అంజిరెడ్డి మండల కేంద్రంలోని వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల్లోని పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు తనభర్తకు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, రాష్ట్ర నాయకులు నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట రెడ్డి, భాస్కరాచారి, నాయకులు లక్ష్మణాచారి, మొగిలి శ్రీనివాస్, ఆరెల్లి శ్రీహరి, భాషబోయిన ప్రదీప్‌యాదవ్, సింగిరెడ్డి రమణారెడ్డి, అశ్విన్ తేజ, ఆదిమూలం శ్రీనివాస్, నందగిరి బలరాం ఆరెపల్లి సునంద్, మాదాసు కుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం ప్రైవేట్ స్కూళ్లలో గోదావరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిషాణరెడ్డి, సంగప్ప. అనిల్, వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి,శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వంద టన్నుల యూరియా సరఫరా

కరీంనగర్‌రూరల్: కరీంనగర్, దుర్శేడ్ ప్రాథమిక సహకార సంఘాలకు మంగళవారం మార్క్‌ఫెడ్ అధికారులు వంద టన్నుల యూరియా కేటాయించారు. దుర్శేడ్ సొసైటీకి 40టన్నులు, చెర్లభూత్కూర్ విక్రయకేంద్రంకు 20, బొమ్మకల్ 20, నగునూరులోని ఆగ్రోస్ కేంద్రంకు 10, తీగలగుట్టపల్లిలోని డీసీఎంఎస్ కేంద్రంకు 10 టన్నుల చొప్పున సరఫరా చేశారు. చెర్లభూత్కూర్‌లో యూరియా బస్తాల అన్‌లోడింగ్‌ను మండల వ్యవసాయాధికారి బి.సత్యం, సొసైటీ చైర్మన్ పి.శ్యాంసుందర్‌రెడ్డిలు పరిశీలించారు. అనంతరం ఒక్కో రైతుకు 4 బస్తాల చొప్పున పంపిణీ చేశారు. కరీంనగర్ సొసైటీకి 40 టన్నుల యూరియా కోసం మార్క్‌ఫెడ్‌కు ఇండెంట్ పంపిస్తే మంగళవారం 20 టన్నుల స్టాక్ వచ్చినట్లు చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా బుధవారం 20టన్నులు, గురువారం మరో 20 టన్నుల యూరియా బస్తాల స్టాక్ వస్తుందని వివరించారు.



చెర్లభూత్కూర్‌లో యూరియా బస్తాల అన్‌లోడింగ్ పరిశీలిస్తున్న ఏవో, సొసైటీ చైర్మన్

పిల్లలు బడిలో ఉండాలి

శంకరపట్నం: బాల్యం మధుర జ్ఞాపకంగా మిగలాలని, పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలని, చిన్నతనం ఆటపాటలతో గడవాలని సామాజిక మాధ్యమాల్లో కేశవపట్నం ఎస్సై రవి పోస్టు చేస్తున్నారు. బాల్యం అపురూపం.. బాలకార్మికులను పనిలో పెట్టుకోవడం నేరం, బాలకార్మికుల గూర్చి తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 సమాచారం అందించాలనే పోస్టులు విద్యాభిమానులను ఆలోచనలో పడేస్తున్నాయి.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లి జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థి సాత్విక ఫిజికల్ సైన్స్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టులో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. రాష్ట్రస్థాయి పోటీలకు సాత్విక ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయురాలు కరుణ, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు మంగతోపాటు పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ సబ్జెక్ట్స్ బోధించుటకు గెస్ట్ ఫ్యాకల్టీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రమేశ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబెక్టుల్లో పీజీ చేసిన ఓసీ, బీసీ అభ్యర్థులు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, విద్యా అర్హత ధ్రువపత్రాలను 13వ తేదీ సాయంత్రం వరకు కళాశాలలో అందజేయాలని, ఇంటర్వ్యూ తేదీని ఫోన్ ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్ గ్రామంలో మంగళవారం ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్సై రవి తెలిపారు. మానకొండూర్ మండలం వెల్ది గ్రామంలోని మానేరు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించామన్నారు.

చర్యలు తీసుకోవాలి

కరీంనగర్‌కల్చరల్: చిలుకూరు బాలాజీ దేవస్థాన ప్రధానార్చకుడు రంగరాజన్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర 6ఏ ఆలయాల ఉద్యోగుల సంఘం జేఏసీ కోచైర్మన్, టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉపాధ్యాయుల చంద్రశేఖర్ అన్నారు. ఒక వ్యక్తి రామరాజ్య స్థాపకుడిని అంటూ వచ్చి విరాళాలు సేకరించాలని రంగరాజన్‌ను బెదిరించడంతో నిరాకరించినందుకు ఆగ్రహానికి గురై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అర్చకులతో అభ్యంతరాలు ఉంటే శాంతిపూర్వకంగా సామరస్యంగా చర్చించి పరిష్కరించుకోవాలని, ఇటువంటి ఉన్మాదస్థితి పనికి రాదని హితవు పలికారు. ప్రస్తుత సమాజంలో అర్చకులపై దాడి చేసే వ్యక్తులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అర్చకునిపై దాడిని ఖండిస్తున్నాం

హైదరాబాద్‌లోని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది అత్యంత హేయమైన చర్య అని శ్రీవైష్ణవ సంఘం జిల్లా శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. అధ్యక్ష కార్యదర్శులు పీచర కృష్ణమాచార్యులు, గోవర్ధనగిరి శశికిరణ్ ఆచార్యులతో పాటు యాదగిరి ఆచార్యులు, శేషం వెంకటరమణాచార్యులు, వానమామలై శ్రీనివాసాచార్యులు, కాందూరి వెంకటేశ్వర్లు, మాడభూషణి శ్రీనివాసాచార్యులు ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



విద్యార్థుల క్షేత్ర సందర్శన

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో రైతు ఎడవెల్లి కిషన్ రెడ్డి సాగు చేస్తున్న పట్టు పురుగుల కేంద్రాన్ని మంగళవారం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. పట్టు పురుగుల పెంపకం, గుడ్డు దశ నుంచి పట్టు వచ్చే విధానం రైతు విద్యార్థులకు వివరించారు. ఎంఈవో వేణుకుమార్, టీచర్లు పాల్గొన్నారు.



ఇల్లందకుంట: మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపు సమీపంలో జమ్మికుంట వైపు వెళ్లే రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెలువడుతోంది. దీంతో నిత్యం అటువైపు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలని ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

> సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
> శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఇల్లందకుంట సెల్ నంబర్: 98496 60330

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో మల్లె, తులసీ అర్చన



జమ్మికుంట: పూజలు చేస్తున్న భక్తులు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తదశ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష మల్లె, తులసీ అర్చన ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు మల్లె, తులసీ ఆకులను స్వామివారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ముక్కా జితేంద్రగుప్తా, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



హుజూరాబాద్: బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌బాబు, ప్రణవ్‌బాబు తదితరులు

హుజూరాబాద్: మండలంలోని సింగాపురం గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య నిర్వహించిన వివిధ పూజా కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని పూలమాలలతో సుందరంగా ముస్తాబు చేశారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఊరేగించారు. బుధవారం ఉదయం జరిగే కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌బాబు, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కోనసీమ కాదు.. చెర్లభూత్కూర్

కను చూపు మేర కనిపిస్తున్న పచ్చని పంటలు.. పొలాల చుట్టూ కొబ్బరి చెట్ల తరహాలో ఉన్న తాటిచెట్లతో ఆంధ్రాలోని కోనసీమను తలపిస్తున్న ఈ దృశ్యం కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లోనిది. ఎల్లమ్మ ఆలయం సమీపంలో రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలతో భూమి అంతా పచ్చని రంగేసినట్లుగా మెరిసిపోతోంది. తాటివనంలో పొద్దాటి కల్లు తాగేందుకు వస్తున్న నగరవాసులు కోనసీమ మాదిరిగా ఉన్న ప్రకృతి అందాలను చూసి సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు. సెల్ఫీలతో సందడి చేస్తున్నారు.

– కరీంనగర్‌రూరల్



పెన్షనర్ల ధర్నా

విద్యానగర్(కరీంనగర్): ఈపీఎస్ 95 పెన్షనర్లకు 9,000 బేసిక్ పెన్షన్‌తో పాటు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డీఏ చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కరీంనగర్‌లోని రీజినల్ ప్రావిడెంట్ ఫండ్‌కార్యాలయం ఎదుట తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈపీఎస్ పెన్షనర్స్‌కు ట్రావెలింగ్‌లో రాయితీతో పాటు వారి కుటుంబానికి పూర్తిస్థాయిలో మెడికల్ రికవరీ సౌకర్యం, తక్కువ పెన్షన్ పొందుతున్న వారికి రేషన్‌కార్డు సౌకర్యం కల్పించాలని, కార్పస్ ఫండ్‌పై వచ్చే వడ్డీకి అనుగుణంగా పెన్షన్ రూ.5,800 చెల్లించాలని కోరారు. అనంతరం రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ సెల్వాట్కర్ తానయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, కోశాధికారి ఇరువంటి తిరుమలయ్య, ఉపాధ్యక్షులు మల్లయ్య, మునురుద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, గోపాల్ రెడ్డి, పోచయ్య, నర్సింగరావు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.